సభకు సొంత ఖర్చులతో రావాలి

ఎమ్మెల్యే మురళీనాయక్ వ్యాఖ్యలపై కార్యకర్తల అసహనం

మహబూబాబాద్, ఏప్రిల్4: ఈ నెల 6వ తేదీన హైదరాబాద్ తుక్కుగూడలో నిర్వహించనున్న కాంగ్రెస్ జనజాతర సభకు పార్టీ నాయకులు, కార్యకర్తలు సొంత ఖర్చులతో రావాలన్న ఎమ్మెల్యే మురళీనాయక్ వ్యాఖ్యలపై ఆ పార్టీ శ్రేణులు అసహనం వ్యక్తం చేస్తున్నాయి. ఈ మేరకు పార్టీ శ్రేణులను సన్నద్ధం చేయడానికి బుధవారం ఎమ్మెల్యే సన్నాహక సమావేశం నిర్వహించి ఖర్చులు పెట్టుకుని స్వచ్ఛందంగా తరలిరావాలని హుకుం జారీ చేయడాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. పార్టీ కోసం ఖర్చు చేసిన వారికే భవిష్యత్తులో మంచి పదవులు లభిస్తాయని, లేదంటే కష్టమేనని చెప్పడం పై నాయకులు, కార్యకర్తలు పెదవి విరుస్తున్నారు. ఎమ్మెల్యే కనీసం ప్రొటోకాల్ పాటించడంలేదని ఆరోపిస్తున్నారు.

మాట్లాడుతున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి

పాఠశాలల్లో కనీస సౌకర్యాలు కల్పించాలి

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

మహబూబాబాద్ రూరల్, ఏప్రిల్ 4 : ప్రభుత్వ పాఠశాలల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని బాలికల హైస్కూల్‌లో నిర్వహించిన 'ప్రభుత్వ పాఠశాలలు–విద్యార్థుల నమోదు' కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రోజు రోజుకు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గిపోతున్నదన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలలు ప్రమాదకర స్థితిలో ఉన్నాయని, ప్రాథమిక పాఠశాలల్లో ఎన్‌రోల్‌మెంట్ ఆందోళకరంగా మారిందన్నారు. తరగతికి కనీసం 15 మంది చొప్పున పాఠశాలలో మొత్తం 75 మంది విద్యార్థులు చేరేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం దృష్టి పెడితేనే ప్రభుత్వ పాఠశాలలు బలోపేతమవుతాయని నర్సిరెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మల్లారెడ్డి, నర్సింహారావు, వెంకటేశ్వర్లు, స్వప్న, నాగమల్లయ్య, మంజుల, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠ

నేడు చిన్న జీయర్‌స్వామి రాక

స్వామి వారికి తొలి పూజలు చేస్తున్న లింగాల కుటుంబం

గూడూరు, ఏప్రిల్ 4 : నాలుగు రోజులుగా మధనాపురంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. గ్రామంలో బొడ్రాయి పూజలతో పాటు రూ. 1.20 కోట్లతో నూతనంగా నిర్మించిన శ్రీలక్ష్మీ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో విమాన గోపుర, ధ్వజ, విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం అంగరంగ వైభవంగా సాగింది. సోమవారం విష్ణు సహస్రనామ పారాయణంతో ప్రారంభమై, 2న యాగ ప్రవేశం, ద్వారాతోరణం, ధ్వజ కుంభారాధన, మూర్తి కుంభారాధన, అగ్ని ప్రతిష్ఠ, 3న శాంతిపాటం, హోమం, నిత్య పూర్ణహారతి, ప్రతిష్ఠామూర్తులకు ధన, ధాన్య, ఫల, పుష్ప శయ్యాదివాసములు, 4న చతుర్వేద విన్నపం, ప్రాయాశ్చిత్త హోమం, ద్వారా తోరణ తొలిబలి, మహా పూర్ణ హారతి, కలశ యంత్ర, శ్రీలక్ష్మీ గోదా సమేత వేంకటేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠ, మహా కుంభ సంప్రోక్షణ ప్రథమ ఆరాధనతో కార్యక్రమాలు ముగిశాయి. ఈ క్రతువును శ్రీమాన్ ముదుంబై లక్ష్మీనారాయణాచార్యులు, యజ్ఞికులు ఉత్పల కృష్ణ చైతన్యల ఆధ్వర్యంలో నిర్వహించారు. కాగా, గ్రామానికి చెందిన క్లాస్ వన్ కాంట్రాక్టర్ లింగాల రాధికాసుధీర్‌రెడ్డి తన సొంత ఖర్చులతో ఆలయాన్ని నిర్మించారు. అలాగే శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న జీయర్‌స్వామి శుక్రవారం గ్రామానికి వస్తున్నట్లు సుధీర్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆలయ సంప్రోక్షణలో పాల్గొని ఆశీర్వచనం చేయనున్నారని, భక్తులు అశేష సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

సమయం మించినా.. పత్తాలేరు!

- పది గంటలైనా తెరుచుకోని పల్లె దవాఖాన
- వడ్డెకొత్తపల్లిలో వేళకు రాని సిబ్బంది

పెద్దవంగర, ఏప్రిల్ 4 : గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్య సేవలందించాలనే సంకల్పంతో పల్లె దవాఖానలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అవసరమైన సిబ్బందిని నియమించింది. అయితే వారు విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తున్నారు. సమయపాలన పాటించకుండా విధులకు హాజరవుతున్నారు. ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణగా వడ్డెకొత్తపల్లిలోని పల్లె దవాఖాన నిలిచింది. ఉదయం 9 గంటలకు విధులకు హాజరుకావాల్సిన వైద్యుడు ఈ రాజ్‌కుమార్, ఏఎన్ఎం భూబాతో పాటు ఆశ కార్యకర్తలు పత్తా లేకుండా పోయారు. 10 గంటలైనా తెరవక పోవడంతో ఈ దవాఖాన పరిధిలోని వడ్డెకొత్తపల్లితో పాటు పోచారం, కొరిపల్లి గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడ్డారు. 10 గంటలు దాటిన తర్వాత ఆశ కార్యకర్త వచ్చినప్పటికీ ఇతర సిబ్బంది మాత్రం చాలా ఆలస్యంగా వచ్చారు. ఓవైపు ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ఉపాధి కూలీలు, ప్రజలకు వడదెబ్బ, ఇతర ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించాలని ప్రభుత్వం ఆదేశాలిచ్చినా అవేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. సిబ్బంది స్థానికంగా కాకుండా పట్టణాల్లో ఉంటుండడంతో ఎప్పుడు వస్తారో.. ఎప్పుడు పోతారో తెలియని పరిస్థితి నెలకొంది. ఈ విషయమై వైద్యుడు రాజ్‌కుమార్‌ను వివరణ కోరగా, తొర్రూరు ప్రభుత్వ ఆస్పత్రి నుంచి ఓఆర్ఎస్ ప్యాకెట్లు తీసుకురావడంతో ఆలస్యమైందని, వాటిని పోచారంలో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలకు పంపిణీ చేయాలని తెలిపారు. అయితే ఇదే విషయమై పోచారం పంచాయతీ కార్యదర్శిని, ఉపాధి కూలీలను అడుగగా ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందించలేదని, కొద్ది రోజుల క్రితమే ఇచ్చారని పేర్కొన్నారు. ఇప్పటికైనా పల్లె దవాఖానలను ఉన్నతాధికారులు పర్యవేక్షిస్తూ విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పది గంటలైనా తలుపులు వేసే ఉన్న పల్లె దవాఖాన

పది గంటల తర్వాత తలుపు తీస్తున్న ఆశ కార్యకర్త

ఖాళీగా ఉన్న వైద్యుడి కుర్చీ

కొనుగోలు కేంద్రాన్ని వినియోగించుకోవాలి

ఐకేపీ ఏపీఎం సంజీవరావు

తొర్రూరు, ఏప్రిల్ 4 : ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు వినియోగించుకోవాలని ఐకేపీ ఏపీఎం సంజీవరావు సూచించారు. గురువారం మండలంలోని ఫత్తేపురంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి ప్రభుత్వ మద్దతు ధర పొందాలన్నారు. ధాన్యం విక్రయించేందుకు వచ్చే రైతులు తమ వెంట పట్టాదారు, బ్యాంక్ పాసుపుస్తకం, ఆధార్ కార్డు తీసుకునిరావాలని ఏపీఎం సూచించారు. కార్యక్రమంలో కార్యదర్శి సుధాకర్, ఏఈవో భరత్‌చంద్ర, సీసీ పద్మావతి, సీఏలు యమున, సంధ్య, నిర్వాహకులు సంధ్య, రజిత, అరుణ, లక్ష్మీనర్సమ్మ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఐకేపీ ఏపీఎం సంజీవరావు

డోర్నకల్‌లో..

డోర్నకల్ : మండలంలోనని వెన్నారం, బంజర గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఏపీఎం శంకర్‌నాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు నాణ్యమైన ధాన్యం తీసుకొచ్చి ప్రభుత్వ మద్దతు ధరను పొందాలన్నారు. కార్యక్రమంలో కేంద్రం నిర్వాహకులు హరీశ్, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

నర్సింహులపేటలో..

నర్సింహులపేట: ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ నాగరాజు సూచించారు. గురువారం మండలంలోని ముంగిమడుగు, వంతడుపుల గ్రామాల్లో మహిళా సంఘాల ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తూకంలో మోసం లేకుండా రైతులకు మద్దతు ధర ఏగ్రేడ్ రూ. 2203, సీ గ్రేడ్ రూ. 2180 అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఏవో రామకృష్ణ, డీ కొమురమ్మ, పీ మంగమ్మ, ఏపీఎం వీరయ్య, సీసీలు భీముడు, సత్యనారాయణ, సమ్మయ్య, నర్సయ్య ఉన్నారు.

శుభకార్యాలకు హాజరైన మాజీ మంత్రి..

పెద్దవంగర, ఏప్రిల్ 4 : పెద్దవంగర గ్రామ మాజీ ఉప సర్పంచ్ శ్రీరాం రాము–స్రవంతి దంపతుల చిన్నారులు శ్రీనిత్య, ఉమామహేశ్వర్ నూతన వస్త్రాలంకరణ, కొడకండ్ల మండలం రంగాపురం గ్రామానికి చెందిన నాయకులు సోమారపు వెంకన్న–ఐలమ్మ దంపతులు కుమార్తె భువనేశ్వరి–ప్రవీణ్ వివాహ వేడుక గంట్లకుంటలో జరుగగా , మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు హాజరై చిన్నారులను, నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ జడ్పీటీసీ జ్యోతిర్మయి, బీఆర్ఎస్ మండలాధ్యక్ష, కార్యదర్శులు ఐలయ్య, సంజయ్, నాయకులు రామచంద్రయ్య శర్మ, సోమనర్సింహరెడ్డి, సుధీర్‌కుమార్, రవి, యాకయ్య, సైదులు, ప్రేమ్‌కుమార్, ఈశ్వర్, లింగమూర్తి, వెంకటేశ్వర్లు, అనుదీప్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

నీటి ఎద్దడి లేకుండా చూడాలి

పెద్దవంగర, ఏప్రిల్ 4 : గ్రామీణ ప్రాంతాల్లో నీటి ఎద్దడి సమస్యలు లేకుండా చూడాలని మండల ప్రత్యేకాధికారి ఎన్ వెంకటేశ్వర్లు సూచించారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వేసవి దృష్ట్యా తాగునీటి సమస్య లేకుండా, మిషన్ భగీరథ నీటి సరఫరాలో ఏమైన సమస్యలు తలెత్తుతే వెంటనే పరిష్కరించాలని, నర్సరీల్లో మొక్కలకు కావాల్సిన నీటిని, సంరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. ఎంపీడీవో వేణుమాధవ్, ఎంపీవో సత్యనారాయణ, ఆర్‌డబ్ల్యూస్, పంచాయతీరాజ్ ఏఈలు యాకూబ్, దయాకర్ పాల్గొన్నారు.

తప్పుడు సమాచారాన్ని నమ్మొద్దు

మున్సిపల్ కమిషనర్ శాంతికుమార్

తొర్రూరు, ఏప్రిల్ 4 : తప్పుడు సమాచారాన్ని నమ్మొద్దని, మున్సిపాలిటీ పేరుతో వ్యాపారులకు మేము మున్సిపాలిటీ నుంచి ఫోన్ చేస్తున్నామని, మీ టాక్స్ పెండింగ్ ఉందని చెప్పి కొన్ని ఫేక్ కాల్స్ వస్తున్నాయని మున్సిపల్ కమిషనర్ పీ శాంతికుమార్ వివరించారు. గురువారం డివిజన్ కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ఇటీవల ఒక సూపర్ మార్కెట్‌కు అగంతక వ్యక్తి ఫోన్ చేసి, మీ ట్రేడ్ లైసెన్స్ రూ. 9990 ఈ ఏడాది కడితే మీకు పర్మినెంట్ లైఫ్ కార్డు వస్తుందని, మరలా టాక్స్ కట్టాల్సినవసరం లేదని సదర్ సూపర్ మార్కెట్‌కు ఫోన్ చేసినట్లు వివరించారు. పట్టణ ప్రజలు ఇలాంటి ఫేక్ కాల్స్‌ను నమ్మొద్దని సూచించారు. అనంతరం ఆ సూపర్ మార్కెట్‌కు వెళ్లి వారితో మాట్లాడినట్లు తెలిపారు. మున్సిపాలిటీకి సమాచారం అందించి, చాకచక్యంగా వ్యవహరించినందుకు అభినందించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ కట్టా స్వామి. వార్డ్ ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కమిషనర్ శాంతికుమార్

తాటి చెట్టు విరిగి గీత కార్మికుడికి గాయాలు

ఇనుగుర్తి, ఏప్రిల్ 4 : ప్రమాదవశాత్తు తాటి చెట్టు విరిగి కింద పడడంతో గీత కార్మికునికి తీవ్ర గాయాలైన ఘటన గురువారం మండల కేంద్రంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెంది న కే సూరయ్య (58) రోజు మాదిరిగానే తాటిచెట్టు ఎక్కగా అది ఒక్కసారిగా విరిగి కింద పడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే స్థానికులు అంబులెన్స్‌లో మహబూబాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

రెండు గడ్డివాములు దగ్ధం

మంటలను ఆర్పుతున్న గ్రామస్తులు

చిన్నగూడూరు, ఏప్రిల్ 4: మండల కేంద్రంలో రెండు గడ్డివాములు దగ్ధమైన సంఘటన గురువారం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన కాగు సంపత్‌కు చెందిన 150 గడ్డిమోపులు, బొల్లు యాకన్నకు చెందిన 70 మోపులు వానాకాలం పంట నూర్పిడి చేసి, పశువుల మేత కోసం వాముగా పేర్చారు. ప్రమాదవశాత్తు నిప్పంటుకొని రెండు గడ్డివాములు దగ్ధమయ్యాయి. దీంతో రైతులు పశువుల మేత కోసం నిల్వ ఉంచిన గడ్డివాములు దగ్ధమవడంతో బోరున విలపించారు. సుమారుగా రూ.40 వేల నష్టం వాటిల్లినట్లు తమను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించినా సకాలంలో రాకపోవడం పూర్తిగా కాలిపోయినట్లు స్థానికులు తెలుపుతున్నారు.

మార్కెట్‌కు 5 రోజులు సెలవులు

కేసముద్రం, ఏప్రిల్ 4 : కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌కు ఐదు రోజుల పాటు సెలవులు ప్రకటించినట్లు మార్కెట్ కార్యదర్శి అమర లింగేశ్వర రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 5న బాబు జగ్జీవన్‌రామ్ జయంతి, 6, 7న సాధారణ సెలవులు, 8న అమావాస్య, 9న ఉగాది సందర్భంగా సెలవులు ప్రకటించినట్లు చెప్పారు.

ప్రజల దాహార్తిని తీర్చేందుకే చలివేంద్రం

మున్సిపల్ కమిషనర్ శాంతికుమార్

తొర్రూరు, ఏప్రిల్ 4 : ప్రజల దాహార్తిని తీర్చేందుకే చలివేంద్రాలు ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ పీ శాంతికుమార్ తెలిపారు. గురువారం పట్టణ కేంద్రంలో ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్, హరిపిరాల రోడ్డు వద్ద రెండు చలివేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వేసవి కాలం పూర్తయ్యే వరకు చలివేంద్రాల్లో స్వచ్ఛమైన తాగు నీటిని అందించనున్నట్లు తెలిపారు. పట్టణ ప్రజలు, బాటసారులు ఈ చలివేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మున్సిపల్ ఏఈ రంజిత్, మేనేజర్ కట్ట స్వామి, హెల్త్ అసిస్టెంట్ రాజు, వార్డ్ ఆఫీసర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

చలి వేంద్రం ప్రారంభం..

కేసముద్రం: మండల కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో కేసముద్రం స్టేషన్ గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలి వేంద్రాన్ని గురువారం తహసీల్దార్ దామోదర్ ప్రారంభించారు. వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలి వేంద్రం ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఈవో అశోక్, సిబ్బంది కృష్ణమూర్తి, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

కేసముద్రం : చలి వేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్

చాప్ల తండాలో..

డోర్నకల్ : మండలంలోని చాప్ల తండాలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గురువారం ఎంపీవో మీర్జా మున్వర్ అలీ ప్రారంభించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సంపత్ తదితరులు పాల్గొన్నారు.

గార్లలో..

గార్ల : మండల కేంద్రంలోని నెహ్రూ సెంటర్‌లో ఏర్పాటు చేసిన చలి వేంద్రాన్ని పంచాయతీ కార్యదర్శి కర్రు కుమారస్వామి గురువారం ప్రారంభించారు. ఈ చలివేంద్రాన్ని ప్రజలు వినియోగించుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బిల్ కలెక్టర్ దాసు, కిషోర్, వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని మార్చాలనుకుంటే బీజేపీనే మార్చేస్తాం

నెల్లికుదురు, ఏప్రిల్ 4 : డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని మార్చాలనుకుంటే బీజేపీనే మార్చేస్తామని జాతీయ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ హెచ్చరించారు. జాతీయ మాల మహానాడు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాజ్యాంగ పరిరక్షణ యాత్ర గురువారం మండల కేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా జాతీయ మాల మహానాడు మండల అధ్యక్షుడు కారం ప్రశాంత్ ఆధ్వర్యంలో యాత్రకు ఘన స్వాగతం పలికారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి రాష్ట్ర అధ్యక్షుడు మాట్లాడారు. కార్యక్రమంలో జాతీయ కార్యదర్శి అసోద భాస్కర్, ఉపాధ్యక్షుడు మన్నె బాబూరావు, రాష్ట్ర నాయకులు ఆసాది పురుషోత్తం, సుందర్, రమణమూర్తి, చిట్టిమల్ల మల్లయ్య, సమ్మయ్య, వెన్ను రాజు, జిల్లా అధ్యక్షుడు గుర్రాల లింగయ్య, జిల్లా అధికార ప్రతినిధి, మహేశ్, రజినీకుమార్ తదితరులు పాల్గొన్నారు.

తొర్రూరు: రాజ్యాంగాన్ని మార్చాలని చూస్తే మిమ్మల్నే మార్చేస్తామని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ అన్నారు. రాజ్యాంగ రక్షణ యాత్ర గురువారం డివిజన్ కేంద్రానికి చేరుకున్న సందర్భంగా పెద్దఎత్తున ర్యాలీ తీసి, బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జాతీయ మాలమహానాడు రాష్ట్ర నాయకులు చిట్టిమల్ల సమ్మయ్య, జిల్లా అధ్యక్షుడు గుర్రాల లింగయ్య, జిల్లా అధికార ప్రతినిధి చిట్టిమల్ల మహేశ్, డివిజన్ అధ్యక్షుడు గొడిశాల నవీన్, మండలాధ్యక్షుడు అనపర్తి నాగేశ్, పట్టణాధ్యక్షుడు అనిల్, నాయకులు కొప్పుల శ్రీనివాస్, అంజయ్య, మల్లేశ్, ప్రవీణ్, రాకేశ్, ధర్మయ్య, రవి, నెల్లికుదురు మండలాధ్యక్షుడు ప్రశాంత్, యువసేన మండలాధ్యక్షుడు సంజీవ పాల్గొన్నారు.

తొర్రూరు: రాజ్యాంగ రక్షణ యాత్రకు స్వాగతం పలుకుతున్న మాల మహానాడు నాయకులు

పచ్చి విత్తన పసుపు

పచ్చి పసుపు @ 6000

నర్సింహులపేట, ఏప్రిల్ 4 : కొన్నేళ్లుగా ఎంతో కష్టపడి పసుపు సాగు చేసినా.. ధర లేక రైతులు నిరాశ చెందారు. దీంతో ఆ పంట సాగు విస్తీర్ణం తగ్గడంతో.. మార్కెట్‌లో ధర పెరిగింది. ప్రస్తుతం మార్కెట్‌లో ఉడకబెట్టిన పసుపు ధర రూ.18 వేల వరకు ఉండడంతో, మళ్లీ పసుపు పంట సాగు వైపు రైతులు మొగ్గు చూపుతున్నారు. దీంతో రైతులు పండించిన కొద్దో గొప్పో పచ్చి పసుపును ఇంటి వద్దకే వచ్చి క్వింటాల్‌కు రూ. 6 వేలు చెల్లించి కొనుగోలు చేస్తున్నారు. విత్తనం కోసం పసుపు విక్రయించడం తమకు కలిసివస్తున్నదని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

వార్డెన్‌లపై చర్యలు తీసుకోవాలి

మహబూబాబాద్, ఏప్రిల్ 4 : బీసీ హాస్టళ్లలో పని చేస్తూ సమయపాలన పాటించని వార్డెన్‌లపై అధికారులు చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ పట్ల మధు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం జిల్లా సంక్షేమాధికారి స్వామికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ చాలా మంది వార్డెన్లు దూర ప్రాంతాల నుంచి విధులకు హాజరవుతున్నారన్నారు. స్థానికంగా ఉంటేనే వార్డెన్ల సేవలు విద్యార్థులకు అందుతాయన్నారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నా అధికారులు చర్యలు తీసుకోవడం లేదని మధు అన్నారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు గంధసిరి జ్యోతిబసు, నాయకులు గుండ్ల రాకేశ్, వరుణ్, వినయ్ పాల్గొన్నారు.

గ్రామీణ వైద్యులకు గుర్తింపు కార్డులివ్వాలి

గార్ల, ఏప్రిల్ 4 : గ్రామీణ ప్రజలకు అత్యవసర పరిస్థితుల్లో ప్రథమ చికిత్స చేస్తున్న గ్రామీణ వైద్యులకు ప్రభుత్వ గుర్తింపు కార్డులివ్వాలని ఆర్ఎంపీ, పీఎంపీ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రవీంద్ర చారి కోరారు. మర్రిగూడెం వేట వేంకటేశ్వరస్వామి దేవాలయం ప్రాంగణంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామీణ వైద్యులు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ప్రథమ చికిత్స మాత్రమే చేయాలని సూచించారు. అనంతరం గ్రామీణ వైద్యుల వెల్ఫేర్ అసోసియేషన్ నూతన ధ్యక్షుడిగా సురభి శేషగిరిగౌడ్‌ను ఎన్నుకున్నారు. సమావేశంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నజీర్ అహ్మద్, నాయకులు కొండల్‌రావు సీహెచ్ శ్రీను, జిలాని, జితేందర్, రాజేందర్, ఉపేందర్, శ్రీధర్, అశోక్, మధుబాబు అనిల్, బాపనయ్య పాల్గొన్నారు.

విద్యార్థులు ఏకాగ్రతతో చదవాలి

నెల్లికుదురు, ఏప్రిల్ 4 : విద్యార్థులు ఏకాగ్రతతో చదివి సత్ఫలితాలు సాధించాలని హెచ్ఎం సంజీవరావు అన్నారు. మండలంలోని నైనాల ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం 7వ తరగతి విద్యార్థులకు 6వ తరగతి విద్యార్థులు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకొని దానిని సాధించే దిశగా శ్రమించాలన్నారు. అనంతరం 7వ తరగతి విద్యార్థులు తాము చదువుకున్న పాఠశాలకు గుర్తుగా సౌండ్ సిస్టంను బహూకరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మండల రాజు, దామెర రాజశేఖర్, టీ సమ్మరాజు, గుగులోత్ రాజన్న, పీ జంపయ్య, జీ వనజ, సీఆర్పీ వీరస్వామి, ఓఎస్ సమ్రీన్ పాల్గొన్నారు.

7న మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష

మహబూబాబాద్ రూరల్, ఏప్రిల్ 4 : జిల్లాలోని ఆదర్శ పాఠశాలల్లో ప్రవేశాల కోసం ఈ నెల 7న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు జిల్లా విద్యా శాఖ అధికారి (డీఈవో) రామారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తరగతి కోసం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, 7 నుంచి 10వ తరగతి వరకు ఖాళీ సీట్ల భర్తీ కోసం మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పరీక్ష జరుగుతుందని పేర్కొన్నారు. పరీక్ష నిర్వహణకు జిల్లాలో పది సెంటర్లను ఏర్పాటు చేశామని, విద్యార్థులు హాల్ టికెట్లను వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని డీఈవో సూచించారు.

బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు రంగారెడ్డి గుండెపోటుతో మృతి

మరిపెడ, ఏప్రిల్ 4: తొలిదశ తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు రామసహాయం రంగారెడ్డి (72) గుండెపోటుతో హైదరాబాద్‌లో గురువారం మృతి చెందారు. మండలంలోని తానంచర్ల గ్రామానికి చెందిన రంగారెడ్డి తొలిదశ తెలంగాణ ఉద్యమంలో కీలకభూమిక పోషించారు. ఆయన ఆకస్మిక మృతి పలువురిని కలిచివేసింది. ఎంపీ కవిత, మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యా నాయక్, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ గుడిపూడి నవీన్‌రావు, రామడుగు అచ్చుత్ రావు, మాజీ ఎంపీపీ వెంకన్న, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు నరేశ్ రెడ్డి, ఎంపీపీ అరుణ, జడ్పీటీసీ శారద రవీంద్ర నాయక్ ఆయన మృతికి సంతాపం వ్యక్తం చేశారు.

ఆకేరు బ్రిడ్జిపై జొన్నను ఆరబోస్తున్న రైతులు

రోడ్లపైనే కల్లాలు.. వాహనదారులకు ఇక్కట్లు

చిన్నగూడూరు, ఏప్రిల్ 4 : రైతులు రోడ్లపైనే కల్లాలు ఏర్పాటు చేస్తుండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చిన్నగూడూరు నుంచి మరిపెడ, మహబూబాబాద్ వెళ్లే రోడ్లపై వరి, జొన్న, పెసర, కంది తదితర పంటలను నూర్పిడి చేస్తున్నారు. దీంతో దుమ్ము, ధూలి లేచి వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ధాన్యంపై నుంచి వెళ్తున్న క్రమంలో ద్విచక్ర వాహనాలు అదుపుతప్పుతున్నాయి. పంట నూర్పిడి చేసిన తర్వాత వ్యర్థాలను రోడ్డుపైనే వదిలి వెళ్తుండడంతో రాత్రి వేళల్లో ప్రమాదానికి గురయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు రైతులకు అవగాహన కల్పించి రోడ్లపై పంట నూర్పిడి చేయకుండా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన

పనులను పరిశీలిస్తున్న రామకృష్ణ